# మమతల మణిహారం

ప్రియదత్త వీక్లీ. 28 నవంబర్, 2001




పోస్టుమేన్ ఇచ్చిన కవర్‌ని ఆత్రంగా అందుకున్న ఇందిర చేతులు సన్నగా వణుకుతున్నాయి.

"ఇందూ... ఎక్కడినుండి ఉత్తరం?" అన్నం తింటూ చేతులు కడుక్కొని వస్తున్న పరంధామయ్యలో ఓ మాదిరి ఆత్రం కన్పిస్తోంది. విషయం ఏముందో..?!

"పాలకొల్లు నుండి శ్రీరామచంద్రమూర్తి గారు!'

ఇద్దరి మొహాలలోను ఒకింత ఆత్రుత నెలకొంది.

"ఏమిటో చదివి చెప్పు!"

"మీరే చదవండి!" అంటూ భర్తకు కవర్ అందించింది ఇందిర.

"మహారాజశ్రీ దివాకర్ల పరంధామయ్య బావగారికి-

పాలకొల్లునుండి వారణాశి శ్రీరామచంద్రమూర్తి నమస్కరించి వ్రాయునది.

ఉభయ కుశలోపరి. నేను, నా భార్య కృష్ణవేణి, మా అబ్బాయి చిరంజీవి ఆనంద్‌బాబు పెళ్ళిచూపుల నిమిత్తమై మీ ఊరు వచ్చినపుడు మీరు మాపై చూపించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాము. మీ కుటుంబం, మీ మంచిమనస్సు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకొన్నాయి. మేము కోరుకునే మధ్యతరగతి మనుషులలోని మందహాసాన్ని మీ ఇంట్లో చూశాము. మీ అమ్మాయిని మా ఇంటికోడలిగా చేసుకోవడానికి మా సమ్మతిని తెలియజేయు చున్నాము. మా కోడలుపిల్ల చిరంజీవి సౌభాగ్యవతి విశాలి అందం, కలుపుగోలుతనం మా అందరికీ నచ్చినది. ఈ శుభవార్తను మా చెల్లెలు ఇందిరమ్మగారికి కూడా తెలియజేయగలరు.

ఈ సందర్భంలో ముందుగా మా కుటుంబ విషయాలు కొన్ని మీకు తెలియజేయవలసిన అవసరం ఉన్నది. మాది ఒక మధ్యతరగతి కుటుంబం. మా నాన్న మీలాగే ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అందరికీ తలలో నాల్కలా ఉండేవారు. మాకు అప్పట్లో ఎక్కువగా ఆస్థిపాస్తులు లేకపోయినా తింటానికి తిండి, ఉంటానికి ఇల్లు, కట్టుకోడానికి బట్టలకు కొదవ లేకుండా రోజులు సాఫీగా సాగిపోయేవి. నిప్పును కడిగి నిప్పులా బ్రతికే నాన్న- సాంప్రదాయాలకు, మంచి మర్యాదలకు, ప్రేమాభిమానాలకు ప్రాణం ఇచ్చేవారు. తదుపరికాలంలో నా భార్య కృష్ణవేణిని నేను వివాహం చేసుకున్న తరువాత మాకు ఎంతగానో కలిసివచ్చింది. సరస్వతీ ప్రసన్నమ్ మాత్రమే ఉన్న ఆరోజులలో కృష్ణవేణితో పాటు మా ఇంట్లో లక్ష్మి కూడా తాండవించింది. వ్యాపారం మీద మక్కువతో దానిలో స్థిరపడ్డ నాకు- ఓర్పు, నేర్పు, సహనంతో కృష్ణవేణి నా జీవితంలో ప్రవేశించిన తరువాత పట్టిందల్లా బంగారమైంది. ఆమె సహచర్యంలో 'పెళ్ళి' అంటే ఉత్సాహం పెద్దగా లేని నాకు- 'మరింతకు ముందు ఎందుకు చేసుకోలేకపోయానా?' అన్పించేది.

మా నాన్న కూడా కోడలు వచ్చిన వేళావిశేషంతో మా ఇల్లు స్వరూపమే మారిపోయిందని ఆమెను చాలా అపురూపంగా చూసేవారు. నడుస్తున్న మహాలక్ష్మిలా కన్పించే ఆమె నుండి మేము చిల్లిగవ్వ కూడా కట్నంగా ఆశించలేదు. నేనేదో గొప్పలు చెప్తున్నాననుకోకపోతే... ఇప్పుడు నా కష్టార్జితపు విలువ- యాభై లక్షల రూపాయలు పైన.

నాకు ఒక్కడే కొడుకు... ఆనంద్! వాడు కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతూ అక్కడ మీ అమ్మాయి విశాలిని చూచి ఇష్టపడ్డ విషయం మీకు తెలుసు. మొదట్లో ఏమో అనుకున్నా... మిమ్మల్నీ, మీ అమ్మాయి అబ్బాయిల్నీ, చెల్లెమ్మగారినీ చూసి- మాతో వియ్యానికి మీరు తగినవారనే నిర్ణయానికి వచ్చాము. పరిచయాలనేవి ముందుమాటల వరకు పరిమితం. పిదప ఆత్మీయతకు, అటుపిదప అనుభూతుల వరకు దారితీస్తుందనడానికి తమ బంధుత్వం ఓ చక్కటి ఉదాహరణ. ఆనాడు మా నాన్న తనకు ఎటువంటి కోడలు కావాలని ఆశపడ్డారో అలాంటి కోడల్ని మీ అమ్మాయి విశాలిలో చూస్తున్నాను. అందుకే మీ సంబంధాన్ని ఖాయం చేస్తున్నాము. మంచిరోజు చూసి తెలియబరిస్తే తాంబూలాలు తీసుకుందుకు వస్తాము.

ఇక్కడ నా మనసులోని మాటను గుర్తు చేస్తున్నాను. కట్నం... మీ అమ్మాయే మాకు పెద్ద కట్నం! సిరిసంపదలు, గౌరవ ప్రతిష్టలకు మాకు లోటు లేదు. మహాలక్ష్మియై మా ఇంట

అడుగిడి అలసిన వేళ మా 'ఆనందా'నికి అమ్మలా, వృద్ధాప్యంలో మమ్మల్ని ఆదరించే తల్లిలా, మా వంశానికి వంశాంకురాన్నిచ్చి వంశాభివృద్ధికి తోడ్పడే అధిదేవతలా మాలో నిలవాలని మా ఆకాంక్ష! మీ నుండి ఏ విధమైన కట్నకానుకలూ ఆశించుట లేదు... కాళ్లు కడిగి కన్యాదానం చేస్తే చాలు! మా అభిప్రాయాలను గౌరవిస్తారనుకొనుచున్నాను. వెంటనే తాంబూలాలకు ముహూర్తం నిర్ణయించి తెలియజేయగలరు.

ఇట్లు
భవదీయుడు
– వారణాశి శ్రీరామచంద్ర మూర్తి
పాలకొల్లు."

విషయం విన్న ఇందిరమ్మగారిలో ఆనందం పెల్లుబికింది.

'ఎంత మంచిసంబంధం! కుర్రాడు ఎంత బుద్ధిమంతుడు! ఆడదానికి మగాడిలో కావల్సింది స్వచ్ఛమైన ప్రవర్తన, నిజాయితీ! అవి ఆనంద్‌లో పుష్కలంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ చదివిన అల్లుడు దొరకడం తమలాంటి సాధారణ కుటుంబీలకు సాధ్యమా?'

...ఇదంతా ఒక కలలా ఉందామెకు. నాలుగు సంవత్సరాలు తమ ప్రక్కఇంట్లో అద్దెకున్న అతను ఎంతో కలివిడిగా ఉండేవాడు. పెద్దవాళ్ళ బుద్ధులు, ప్రవర్తనలే పిల్లలకి కూడా వస్తాయంటారు. ఈరోజులలో కుర్రకారు ఎంతగా, ఎన్ని విధాలుగా దిగజారిపోతున్నారు? కాని, ఆనంద్ ఎంత చనువుగా ఉన్నా– విశాలితో ఎంత హద్దులతో మెలిగేవాడు? వారిద్దర్నీ చూస్తే తనకు ఎంత ఆనందం వేసేది! కానీ, తమ తాహతుకి అందని ద్రాక్షపండు అతను.

దేవుడు తప్ప అన్నీ ఉన్నవారు– దేవుడు తప్ప ఏమీ లేనివార్ని చూసి నవ్వుతారు. కాని, శ్రీరామచంద్రమూర్తిగారు దానికి పూర్తిగా విరుద్ధం! తమ విశాలి ఏనాడో బంగారుపూలతో పూజ చేసి ఉంటుంది... బంగారంలాంటి మొగుడు దొరికాడు. ఆడపిల్ల ఓ స్వాతిచినుకు లాంటిది. మంచిమగవాడనే ఆల్చిప్పలో ఆ చినుకు పడితే ఆమె జీవితం ధన్యమై, ముత్యమై భాసిస్తుంది.

"ఈ శుభవార్తను అమ్మాయి కాలేజికి ఫోన్ చేసి చెప్పండి! సంతోషించి ఆ ఆనందాన్ని నలుగురితోనూ పంచుకుంటుంది!"

"సరే..! చైతన్య ఏడీ?"

"ఈరోజు వాడి కాలేజికి సెలవట... ఫ్రెండ్స్‌తో మార్నింగ్ షోకి వెళ్లాడు."

పరంధామయ్య మౌనంగా పడక్కుర్చీలో పడుకొని ఆలోచిస్తున్నాడు. తనలో శాంతి, సంతోషాలు ప్రజ్వరిల్లుతున్నా– ఊహలు మాత్రం పైన తిరుగుతున్న సీలింగ్‌ఫ్యాన్‌ని వెక్కిరిస్తూ దానికన్నా వేగంగా తన మస్తిష్కంలో పరిభ్రమిస్తున్నాయి. అతనిలో పంచరంగుల వర్ణచక్రంలా వివిధరకాల భావ సమ్మేళనం– ఆనందం, అసంతృప్తి, నిట్టూర్పు, భావావేశం అన్నీ కలగలిసి తన మనోనేత్రాన్ని చుట్టుముట్టి అతలాకుతలం చేస్తున్నాయి.

తనలాంటి అతిసామాన్య కుటుంబీకునికి అంత మంచి సంబంధం. అదీ... రామచంద్ర మూర్తిగారితో వియ్యమొందడం కలలో కూడా ఊహకందని విషయం! అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. ఆనంద్‌లాంటి యువకుణ్ణి అల్లుడిగా తేవడం వాస్తవదృష్టితో ఆలోచిస్తే తనకు సాధ్యమా? అమ్మాయి తప్పక సుఖపడుతుంది. వారికి వివాహం జరిపిస్తే తోడూనీడల తోటలో

వారి దాంపత్యం తేటతేట తెలుపులా తళతళలాడుతుంది. కానీ తన ఆశయాలకీ, ఉద్దేశాలకీ తిలోదకాలివ్వడమేనా? తను ఏనాడైనా ఏ విషయంలోనైనా రాజీపడ్డాడా? ఇప్పుడు పడక తప్పదా?!

మనసు రాజీపడవద్దని గట్టిగా చెబుతోంది. తీవ్రమైన భావ సంచలనంతో అచేతనంగా ఉండిపోయిన పరంధామయ్య మనసు ఓ దృఢమైన నిర్ణయం తీసుకోవడంతో ఒకింత గట్టిపడింది. తన ఉద్దేశాన్ని తెల్పుతూ రామచంద్రమూర్తికి ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడు.

"మహారాజశ్రీ వారణాశి శ్రీరామచంద్రమూర్తిగారికి, శ్రీమతి కృష్ణవేణిగార్లకు-

కాకినాడ నుండి దివాకర్ల పరంధామయ్య వ్రాయునది.

మిమ్మల్ని 'బావగారూ, చెల్లెమ్మగారూ' అని సంబోధించలేకపోతున్నందులకు మన్నించండి. విశాల హృదయంతో మా విశాలిని మీ ఇంటికోడలిగా అంగీకరించినందులకు కృతజ్ఞతలు. కానీ, ఆ వివాహ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నందుకు మన్నించండి.

ఇది నా మూర్ఖత్వం అనుకున్నా, మొండితనం అనుకున్నా... లేక అవివేకం అని పేరు పెట్టినా ఇది మీ ఇష్టం! మీ నాన్న మీకు చూపిన మార్గంలాగే మా నాన్న ద్వారా సంక్రమించిన ఖచ్చితమైన అభిప్రాయాలు కొన్ని ఉన్నాయి నాకు. మా అమ్మాయి చేయి నందుకొనే వరుడు మేమిచ్చే కట్నకానుకలను తప్పక స్వీకరించాలని నా ఆకాంక్ష! నా ఉద్దేశాన్ని గౌరవించలేని వ్యక్తికి మా ఇంటి అల్లుడయ్యే అవకాశం లేదు. మా నుండి ఏమాత్రం సొమ్ములు ఆశించని మీకు అభినందనలు! కాని, మీ అబ్బాయిలోగాని ఏవో లొసుగులున్నాయని నా అనుమానం. అందుకే ఆదర్శాలు వల్లె వేస్తున్నారని నా భావన! అసలు ఏమీ ఆశించకపోవడానికి మనం కేవలం మానవమాత్రులం. దైవాంశ సంభూతులం కాదు కదా!? మనం ఉన్నది కలియుగంలో! స్వలాభాపేక్ష ఏమీ మీలో లేదంటే నమ్మలేకపోతున్నాను.

ఇక్కడ మీలాగే నా మనసులోని మాటల్ని మీ ముందు ఉంచదల్చుకున్నాను. నాకు ఇద్దరు సంతానం. అమ్మాయి విశాలి, అబ్బాయి చైతన్య. విశాలి ఇప్పుడు పోస్టుగ్రాడ్యుయేషన్ ఫైనలియర్. చైతన్య డిగ్రీ ఫస్టియర్. నాకు ఈ పెళ్ళిళ్లు, కట్నకానుకలు, డబ్బు ఇచ్చిపుచ్చుకోవడాలు మీద ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటిని ఓ వ్యాపార దృక్పథమనుకున్నా లేక చాదస్తం అనుకున్నా మీ ఇష్టం! నేను నా ఉపాధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ చేసి పెన్షన్ ఆధారంగా జీవనాన్ని సాగిస్తున్నవాణ్ణి. పెద్ద బ్యాంక్ బ్యాలెన్స్ ఏమీ లేకపోయినా- నా తాహతుకు తగ్గ రీతిలో కట్నకానుకలిచ్చి నా కూతురిని అత్తవారింటికి పంపాలని నా అభిలాష! మీది కట్నం తీసుకోలేని నిర్ణయం అయితే కట్నం ఇవ్వడమనేది నా అభిమతం!

సున్నితంగా ఆలోచిస్తే- నాకు కొడుకు, కూతురు. వాళ్ళిద్దరూ మాకు జన్మించి మా దంపతులకు తల్లిదండ్రుల హోదా కల్పించినవారు. అందుచేత వారికి మేమెంతో ఋణపడి ఉన్నామని నా ఉద్దేశం. అల్లుడికి 'కట్నం' పేరుతో కొంత ముట్టజెప్పి అమ్మాయిని అత్తవారింటికి పంపడం అనేది ఒక అదృష్టంగా భావిస్తాను. కట్నం అనేది అందరి దృష్టిలో దురాచారం అయిఉండొచ్చు. కానీ, దాన్ని నేను మరోకోణం నుండి చూస్తుంటాను. నాకు తండ్రి హోదా కల్పించిన ఆమెకు నేనిచ్చే ప్రతిఫలం అది. ఒకవిధంగా ఋణం తీర్చడం అన్నమాట!

కానీ కట్నం అనేది లేకుండా నాకున్న ఆస్తిపాస్తుల్ని వారిద్దరికి సమానంగా పంచి ఇచ్చానే అనుకోండి... ఆస్తుల్ని సమంగా పంచిననాడు వృద్ధాప్యంలో మమ్మల్నిద్దర్నీ చూడవలసిన బాధ్యత

కొడుకుకీ, కూతురుకీ చెరిసగం ఉంటుంది. అంటే మా ఇద్దర్నీ చెరో 6 నెలలు పంచుకొని పోషించవచ్చు. లేకపోతే భార్యాభర్తల్ని వేరుచేసి ఇద్దరూ చెరొకర్ని తీసుకొనిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇది మరీ దుర్భరం! అలా ఇంటింటా తిరిగేదానికి నా మనసు అంగీకరించదు. మేమిద్దరం మనసు చంపుకొని కూతురు చెంత చేరితే అల్లుడు మమ్మల్ని ఒప్పుకోకపోవచ్చు. అందుచేత ఈ పురుషాధిక్య ప్రపంచంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడవలసిన బాధ్యతల నుండి కన్నకొడుకు, మరో ఇంటినుండి వచ్చిన కోడలు తప్పించుకోలేరేమో! ఇది తరతరాల ఆచారం. దానికి మనం మినహాయింపు ఏమీ కాదని నా అభిప్రాయం! అందుకే నా సంపాదనలన్నీ నా కొడుక్కి వప్పజెప్పాలనుకుంటున్నాను.

మరి, కూతురు యుక్తవయస్సు వరకూ మాతో ఉండి ప్రేమాభిమానాల్ని పంచినా– ఆమె మరో ఇంటికోడలు! ఆమె నుండి నేను ఒక్క వాత్సల్యం తప్ప ఏవిధమైన సహాయం ఆశించలేను. అందుకే ఆమెకు కృతజ్ఞతగా నా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లోని మూడులక్షల రూపాయలలో ఒక లక్ష కట్నంగా ఇవ్వాలని నా అభిలాష!

నా ఉద్దేశాలను గౌరవించని వియ్యం నాకిష్టం లేదు. మిమ్మల్ని మనస్తాపానికి గురిచేసి నందులకు మన్నించండి. మా నాన్న కూడా తన కోడలి విషయంలో అదే సూత్రాల్ని అవలంబించాడు. రేపు నా కోడలి నుండి కూడా ఇదే ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాను. ఈ విషయంపై ఇక ప్రత్యుత్తరాలకు తావు లేదు.

ఇట్లు

– దివాకర్ల పరంధామయ్య

కాకినాడ"

• • •

బిగుసుకున్న ఛాందసాల ఉచ్చుల నుండి తప్పించుకోడానికి– పెద్దల మాటకు పిల్లలు జూలు విదిలించక తప్పింది కాదు.

"కట్నం వద్దని ఒకరు, తీసుకోకపోతే కుదరదని మరొకరు పట్టుబట్టి విషయాన్ని జటిలం చేస్తే మీ పెద్దరికాలు ప్రక్కన పెట్టి మేమే మా పెళ్ళికి పెద్దరికం వహించవలసి వస్తుంది." ఆనంద్, విశాలి అన్నమాటలు మొదట అర్థంకాలేదు పరంధామయ్య, శ్రీరామచంద్రమూర్తిగార్లకు.

"ఏముందీ... మీమీ అభిప్రాయాలకు నిజంగా అభినందనలు! కానీ, అవి అందరికీ సంతోషకరంగా, ఆమోదయోగ్యంగా ఉండాలి. అప్పుడే వాటికి విలువ. కాని మూర్ఖంగా తీసుకోమనీ, వద్దనీ గిరిగీసుకు కూర్చుంటే చివరికి జరిగేది ఒక్కటే!

మీరిద్దరూ వల్లెవేస్తున్న సాంప్రదాయాలకు, మంచిమర్యాదలకు 'చెక్' చెప్పి మా దారి మేము చూసుకోవడం ఒక్కటే శ్రేయస్కరం! మీకు ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే మీరు మాకు చేసే పెళ్ళికి గుడ్‌బై కొట్టి మీకు దూరంగా 'లేచిపోవడ' మన్నమాట!"

కఠినమైన శిలలను కూడా కాలమే కరిగిస్తుందట!

చివరకు పిల్లల మమతల మణిహారానికి పెద్దరికాలు దిగివచ్చాయి. వారి వారి భావాలకు భంగం లేకుండా సున్నితమైన ముగింపు ఇచ్చారు పెద్దలమాటు పిల్లలు.

• • •

ఆ రోజు పరంధామయ్యగారి ఇల్లంతా బంధుమిత్రులతో కోలాహలంగా ఉంది.

అది విశాలి, ఆనంద్‌ల పరిణయానికి నిశ్చయతాంబూలాలు ఇచ్చిపుచ్చుకొనే రోజు!

"బావగారూ! కూతురు మీద ప్రేమతో, వాత్సల్యంతో పసుపుకుంకుమల రూపంలో ఇచ్చిన లక్షరూపాయలు ముట్టాయి!" శ్రీరామచంద్రమూర్తి అంటూంటే పులకించాడు పరంధామయ్య.

"బావగారు ఇచ్చిన వెంటనే మా అభిమతాన్ని మన్నించి తీసుకున్నందుకు చాలా సంతోషం!" ప్రశంసలతో వియ్యంకుణ్ణి సేదదీర్చాడు పరంధామయ్య.

"బావగారూ! 'వధు విక్రయం' అని పేరుపెట్టి మరల మా కట్నం సొమ్ముల్ని అమ్మాయికి నగలు చేయించమని చెప్పి ముట్టజెప్పిన మీ స్ఫూర్తికి జోహార్లు!" పరంధామయ్య పులకరించాడు.

"నా కోడలే నాకు కట్నం! ఆమె మా ఇంట అడుగుపెట్టి సిరులు కురిపించాలే గాని- వేరే సొమ్ములు మాకెందుకు?" కృష్ణవేణి సున్నితమైన ప్రశంస.

"ఆనంద్‌బాబు మా అందరి మనసుల్ని ఆనందమయం చేశాడు!" ఇందిరమ్మగారి ఆనందం!

"పరంధామయ్య తన కూతురును అల్లారుముద్దుగా, అపురూపంగా పెంచాడు!" ఓ బంధువు పొగడ్త.

"పసుపు కుంకుమల పేరుతో పరంధామయ్యగారు చేసినది ఉన్నతం!" ఓ ముత్తయిదువ మాట.

"కట్నం కోసం కోడల్ని హింసించే మామల్ని చూశాంగాని- 'కట్నం వద్దు మొర్రో...' అనే మామని శ్రీరామచంద్రమూర్తిలోనే చూస్తున్నాం!" ఊరిపెద్ద స్టేట్‌మెంట్.

"కూతుర్ని ఎలా వదిలించుకుందామా...' అని చూసే తల్లిదండ్రులు మనకు తెలుసుగాని- వారి జన్మకు సరైన భాష్యం చెప్పి కట్నం ఇస్తున్నామనే బాధ లేకుండా పిల్లల్ని సత్కరించిన తండ్రిని పరంధామయ్య మాష్టారిలోనే చూస్తున్నాం!" మరొకాయన కామెంట్.

"ఎవరి సిద్ధాంతాలు వారివైనా వాటిలో అర్థం ఉంది, పరమార్థం ఉంది. వీరిద్దరూ ఆదర్శవంతమైన వియ్యంకులు... వీరిదే అసలైన వియ్యం!" పురోహితుని ప్రశంస.

"బ్రహ్మారాయుర్భవ ధాన్యం ధనం పశు పుత్రలాభం, శత సంవత్సరం దీర్ఘమాయుహు, ఈ నిశ్చితార్థ సమయంలో వియ్యంకులిద్దరూ ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నవి లక్ష రూపాయలు..!" పురోహితుడు మంత్రాలు చదువుతూంటే వధూవరుల హృదయాల్లో దరహాసంతో కూడిన వలపు వసంతం చిగురిస్తోంది.

"నారాయణ స్వరూపాయ వరాయ
లక్ష్మీ స్వరూప్యాం వధూం"
"సాలంకృత కన్యాదాన మహం తుభ్యమహం
సంప్రదదేం నమః"

వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కొబ్బరిబోండాంతో వధువు విశాలిని వరుడు ఆనంద్‌కు అప్పగిస్తున్న ఆ 'సుధాభాండ' దృశ్యాన్ని ఆనందాతిశయాలతో వీక్షించసాగారు వచ్చిన బంధుమిత్రులు.